క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సహాయం



బీటీఆర్ నగర్‌లో మృతుడు భార్యకు రూ.10 వేలు నగదు అందజేస్తున్న కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు బీటీఆర్ నగర్‌లో తురకపూడి నాని కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గత నెల 20న మృతి చెందారు. ఆయనకు వైఎస్సార్ బీమా వర్తించింది. ఈ మేరకు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి సచివాలయం సిబ్బందితో మృతుడి కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. వైఎస్సార్ బీమాలో భాగంగా తక్షణ సహాయం కింద మృతుడు భార్య జయలక్ష్మికి రూ.10 వేలు నగదు అందజేశారు. మిగతా బీమా డబ్బులు ఆమె బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శి, వలంటీర్ పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ కాంపిటీషన్‌లో సత్తా



బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇటీవల చెన్నైలోని వెల్‌టెక్ యూనివర్సిటీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ కాంపిటీషన్ విసాయ్ -2024లో సత్తా చాటారు. ఈ పోటీల్లో 200 కళాశాలల విద్యార్థులు పాల్గొనగా ఏయూ విద్యార్థుల బృందం ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆచార్య ఎస్.బాలప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రదర్శన



సాంకేతిక ప్రదర్శన తిలకిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన మానసిక ఆరోగ్య పరీక్షల పరికరాల ప్రదర్శనను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ గురువారం ఉదయం సందర్శించారు. నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని విభాగంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వివిధ మానసిక సమస్యలను గుర్తించడానికి ఉపయోగించే సాంకేతిక పద్ధతులు, విధానాలను విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు వివరించారు. పెద్ద సంఖ్యలో నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు విచ్చేసి ఈ ప్రదర్శనను తిలకించారు.

భారతీయ కళలతోనే సాంస్కృతిక వైభవం

సీతంపేట: నటరాజ నృత్య నికేతన్ నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ ఆధ్వర్యంలో గురువారం శంకరమఠం రోడ్డులోని పద్మశాలి భవనంలో నృత్య విద్యార్థులచే గజ్జపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ భారతీయ కళలతోనే సాంస్కృతిక వైభవం ఉట్టిపడుతుందన్నారు. సాంస్కృతిక సంప్రదాయ కళగా విరాజిల్లుతున్న నృత్యాన్ని ఎవరైతే గురుముఖంగా భక్తిశ్రద్ధలతో నేర్చుకుంటారో వారు అత్యున్నతమైన కళాకారులుగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో టి.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు, కల్యాణి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు భరోసా



చినగదిలిలో మహిళతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజలకు భరోసాగా నిలిచాయని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 12వ వార్డులో గురువారం గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఆయన పాదయాత్ర నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి ఎంపీ చినగదిలి, నేతాజీనగర్, బీసీ కాలనీల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి గురించి ఆరా తీశారు. ఎవరికి ఏయే పథకాలు అందాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ గడపగడపకు కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న తమను అన్ని చోట్లా ప్రజలు ఆనందంతో ఆహ్వానిస్తున్నారన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని అంతా ముక్తకంఠంతో కోరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైల్డ్ లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, స్థానిక నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, జ్యోతి ప్రకాష్, మురళీ, వెంకట అప్పారావు, రాజు, శ్రీను, కొండమ్మ, ప్రసాద్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ప్రతిష్ట



అన్నదానం చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరులో సాయి సృజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుంప పోలిరెడ్డి నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, 20వ వార్డు కార్పొరేటర్ ముప్వల లక్ష్మి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎంపీ పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ కార్యాలయ భవనం కోసం వినతి



ఎంపీ సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

ఏయూ క్యాంపస్: సీషోర్ వాకర్స్ క్లబ్‌కు ప్రత్యేకంగా భవనం కేటాయించాలని కోరుతూ గురువారం విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను క్లబ్ సభ్యులు తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తమ క్లబ్‌లో సుమారు 1700 మంది వరకు సభ్యులు ఉన్నారని, ఆరోగ్యం, వెల్‌నెస్, సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామన్నారు. తమ సంస్థ కార్యకలాపాలను నిర్వహించడానికి వీలుగా వీఎంఆర్‌డీఏ పార్కులో భవనం కేటాయించాలని కోరారు. పార్కులో వినాయక గుడి వెనక ఉన్న చిన్న స్థలాన్ని తమ కార్యాలయ నిర్వహణకు వీలుగా కేటాయించాలన్నారు. దీనిపై ఎంపీ ఎంవీవీ సానుకూలంగా స్పందించారు. ఆరోగ్య జీవనం గడపడానికి కృషి చేస్తున్న క్లబ్‌కు తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి జి.తిరుపతిరావు, కోశాధికారి ఎం.ఎస్.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో పటిష్ట భద్రత చర్యలు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో మరింత పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నట్టు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఓ యువకుడు కత్తితో చొరబడి సిబ్బంది వద్ద హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. దీంతో గురువారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు ఇన్ పేషెంట్ వార్డులను పరిశీలించారు. కత్తితో యువకుడు హల్‌చల్ చేసిన సంఘటనపై ఆరా తీశారు. సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్టమైన చర్యల గురించి విమ్స్ వైద్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమ్స్‌లో మరింత భద్రత ఏర్పాటు చేయడానికి పోలీస్ సిబ్బంది సంఖ్యను పెంచాలని, ఇప్పటికే ఉన్న అవుట్ పోస్టులో పోలీసులు నిరంతరం విధులు నిర్వహించేలా చూడాలని నగర పోలీస్ కమిషనర్‌కు కోరినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి జరిగిన ఘటనపై ఆరిలోవ పోలీసులు కూడా సీసీ ఫుటేజీలు పరిశీలించారు. పరారీలో ఉన్న నిందితుడు నవీన్‌పై కేసు నమోదు చేశారు.

విద్యతో పాటు సేవాభావం అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: విద్యతో పాటు సేవాభావాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహించిన శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛంద సేవకులుగా దేశానికి సేవ చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి.జయ మాట్లాడుతూ సేవాతత్వంతో సహాయం చేయడం విద్యార్థి దశలో అలవర్చుకోవడం ద్వారా సమున్నతస్థానానికి చేరుకోవచ్చునన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి పి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఏడు రోజులుగా మద్దిలపాలెం, రెల్లివీధి పరిసర ప్రాంతాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్లాస్టిక్ నిషేధం, ఎంప్లాయిబిలిటీ, లైఫ్ స్కిల్స్, పోషకాహార విలువలు తెలియజేశామన్నారు. స్వచ్ఛభారత్, ప్లానిటేషన్, ర్యాలీలు, సోషల్ సర్వేలు, వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు.

బ్రాహ్మణులను అవమానించిన రాజేష్‌ను ఓడించండి



సమావేశంలో మాట్లాడుతున్న వామనరావు, నారాయణ తదితరులు

ఎంవీపీ కాలనీ: రాష్ట్రంలోని బ్రాహ్మణ సామాజిక వర్గం ప్రజలను, మహిళలను అవమానించిన మహాసేన రాజేష్‌ను ఓడించాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సీనియర్ నాయకుడు పీవీ నారాయణ కోరారు. ఎంవీపీ కాలనీలోని ఓ హోటల్‌లో వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఓ క్రైస్తవ సభలో పాల్గొన్న రాజేష్ మాట్లాడుతూ బ్రాహ్మణ అమ్మాయిలను, అగ్రవర్ణాల అమ్మాయిలను ప్రేమించి వివాహం చేసుకుంటే లక్ష బహుమతిగా ఇస్తానంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కులాల మధ్య చిచ్చురేపే ఇలాంటి వ్యక్తికి టీడీపీ ఎమ్మెల్యే టికెట్టు ఇస్తే రాష్ట్రంలో పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ట్రేడ్ యూనియన్ నాయకుడు వామనరావు మాట్లాడుతూ బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని అవమానించడంతో పాటు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన మహాసేన రాజేష్‌ను టీడీపీ అధినేత చంద్రబాబు వెంటనే పార్టీ నుంచి బహిష్కరించి, ఎమ్మెల్యే టికెట్టు ఇచ్చే నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలన్నారు. లేకుంటే టీడీపీకి బ్రాహ్మణ సామాజికవర్గం నుంచి ప్రతిఘటన తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకెళ్ల రమణమూర్తి, నండూరి సుబ్రహ్మణ్యం, జోష్యుల సురేష్, రాచకొండ దశరథరామయ్య పాల్గొన్నారు.

రైతుబజార్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు



ఎంవీపీ రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ గతంలో 8 సీసీ కెమెరాలు ఉండేవి. అవన్నీ పాడవడంతో ఏడాది క్రితం తొలగించారు. అప్పటి నుంచి ఇక్కడ సీసీ కెమెరాలు లేకపోవడంతో రైతులు, వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందిపడేవారు. పలుమార్లు రైతుల స్టాళ్లలో దొంగతనాలు జరిగిన ఘటనలూ ఉన్నాయి. వినియోగదారులను జేబు దొంగల బెడద కూడా వేధించేది. సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటుతో ఆ సమస్యలకు బ్రేక్ వేశారు. ప్రస్తుతం 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రైతుబజార్‌కు వాచ్‌మన్‌ను కూడా నియమించినట్లు ఈవో ప్రసాద్ తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

డీఈవో చంద్రకళ



అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈవో చంద్రకళ

సింహాచలం: పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో చంద్రకళ విద్యార్థులకు సూచించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురువారం ఆమె స్టడీ అవర్స్‌లో సందర్శించారు. పదోతరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థి దశలో పదోతరగతి ఎంతో కీలకమైందన్నారు. పరీక్షలంటే భయపడవద్దని, అవగాహనతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. జీవితానికి టర్నింగ్ పాయింట్ పదోతరగతి అని.. ప్రణాళికబద్ధంగా ప్రతి విద్యార్థి ముందుకు వెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని కోరారు. మరో 18 రోజులు మాత్రమే పరీక్షలకు సమయం ఉందన్నారు. అనంతరం సబ్జెక్టుల వారీగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు పాల్గొన్నారు.

నేడు విమ్స్‌లో న్యూరో ఉచిత వైద్య శిబిరం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో శుక్రవారం న్యూరో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ బ్లాక్‌లో జరుగుతుందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రెయిన్ స్ట్రోక్, నరాల సమస్యలు, వెన్నుముఖ సమస్యలు, నడుము నొప్పి, చిన్న పిల్లలకు మానసిక వైకల్యం తదితర సమస్యలకు ఇక్కడ ఉచితంగా సేవలు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. చికిత్సలు కూడా ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో బ్రెయిన్ స్ట్రోక్ నిర్ధారించేందుకు అవసరమైన ఈసీజీ, సిటీ స్కాన్ కూడా చేస్తామన్నారు.

యాదవులకు రాజకీయ ప్రాముఖ్యత కల్పించాలి



ఐక్యత చాటుతున్న ఉత్తరాంధ్ర యాదవ సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం : ఉత్తరాంధ్రలో అధిక సంఖ్యలో ఉన్న యాదవ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాముఖ్యత కల్పించాలని ఉత్తరాంధ్ర యాదవ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు డిమాండ్ చేశారు. శివాజీపాలెంలోని సంఘం కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రధాన రాజకీయ పార్టీలు యాదవ సామాజిక వర్గానికి ఉత్తరాంధ్రలో 4 ఎమ్మెల్యే సీట్లు, 2 ఎంపీ సీట్లు కేటాయించాలన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక్కొక్క శాసనసభ సీటు, విశాఖపట్నం, అనకాపల్లి లోకసభ స్థానాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు నర్సు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నగర సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న భక్తులు, హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం నగర సంకీర్తన కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలి నుంచి సెక్టార్-6లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు భక్తులు సంగీత వాయిద్యాలు వాయిస్తూ, నాట్యాలు చేస్తూ, భక్తిగీతాలు ఆలపిస్తూ సంకీర్తన చేశారు. శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతీ ఠాకూరా 150వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు తెలిపారు.

ఎంవీపీ రైతుబజార్‌లో కొత్త రకం కూరగాయలు



సల్లారీ ఆకుకూర విక్రయిస్తున్న రైతు గోపీనాథ్



జుగునీ కాయలు



లొటియోస్

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో ఓ ఏజెన్సీ రైతు కొత్త రకం కూరగాయలు విక్రయిస్తున్నాడు. ఇవి చూడడానికి దేశవాలీ కూరగాయలు మాదిరిగా కనిపిస్తున్నా వాటిలో కొత్తదనం ఉంది. ఏజెన్సీ ప్రాంతం అరకుకు 20 కిలోమీటర్లు దూరంలో దేవడువలసకు చెందిన రైతు పి.గోపీనాథ్ తన పొలంలో పండించి ఎంవీపీ రైతుబజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. గోపీనాథ్‌కు మూడెకరాల పొలం ఉంది. ఆ పొలంలో కొంత భాగంలో కూరగాయలు సాగు చేపడుతున్నాడు. నిత్యం పండించే కూరగాయలతో పాటు అరుదైన వాటిని పండించాలనే ఆసక్తి ఆయనకు ఎక్కువ. దీంతో ఒడిశా రాష్ట్రంలో కొన్ని కొత్త వంగడాల విత్తనాలు తీసుకొచ్చి పొలంలో పండించడం ప్రారంభించాడు. ఆ పంటలు చేతికి వచ్చినప్పుడల్లా వాటిని ఇక్కడ రైతుబజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తుంటాడు. వారంలో రోజులుగా సల్లారీ, జుగునీ, లూటియోస్ కూరగాయాలు తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. సల్లారీ ఆకుకూర. ఇది చూడడానికి ముల్లంగి ఆకులు మాదిరిగా ఉంటుంది. కానీ వాటి కంటే ఇవి వెడల్పు, మందం ఎక్కువగా ఉంటుంది. జుగునీ కాయకూర. ఇవి పసుపు పచ్చగా ఉండి పొడవు సొరకాయలు మాదిరిగా కనిపిస్తాయి. లొటియోస్ క్యాబేజీ మాదిరిగా చిన్న సైజులో ఉంటుంది. ఇవన్నీ కిలో రూ.80కు ఈ రైతు విక్రయిస్తున్నాడు. ఈ పంటలు కాలానుగుణంగా పండుతాయని, దిగుబడి తక్కువగా ఉంటుందని గోపీనాథ్ తెలిపాడు.

ఏయూ సమాచారమ్

మహిళా దినోత్సవ కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మూడు రోజుల కార్యక్రమాల వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం ఉదయం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 4న ఫార్మసీ కళాశాల సమావేశ మందిరంలో విమెన్ ఆఫ్ ది యూనివర్సిటీ కార్యక్రమాన్ని, 6న ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో వర్క్‌షాప్‌ని, 7న ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలు ఆచార్య పల్లవి, మహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ మెస్ తనిఖీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థినుల వసతి గృహం మెస్‌ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాగార్జున వసతి గృహంలోని మెస్‌లో భోజన నాణ్యత ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. భోజన నాణ్యతపై విద్యార్థినులు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి రిజిస్ట్రార్ మెస్‌లో భోజనం చేశారు.

జూలై 11 నుంచి సదస్సు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జూలై 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న జియో స్పేషియల్ టెక్నాలజీస్ ఆన్ రిజర్వాయర్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ చాలెంజెస్‌ సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య వజీర్ మహ్మద్, సదస్సు కన్వీనర్ ఆచార్య పెద్దాడ జగదీశ్వరరావు, సహ కన్వీనర్ ఆచార్య పి.వి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

దిశ దివ్యాంగ్ సురక్షను సద్వినియోగం చేసుకోండి



విశాల్ గున్నికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సురేష్‌మీనన్

ఏయూ క్యాంపస్: దిశ దివ్యాంగ్ సురక్షను సద్వినియోగం చేసుకోవాలని డీఐజీ విశాల్ గున్ని అన్నారు. విశాఖ రేంజ్ డీఐజీగా వచ్చిన ఆయనను ఏయూ పరిశోధకుడు డాక్టర్ ఎం.సురేష్‌మీనన్, రాజేష్, విజయ్‌కుమార్‌లు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విశాల్ గున్ని మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు పని చేస్తున్నామన్నారు. ఆపదలో ఉన్న దివ్యాంగులు 7337434422 నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చునని సూచించారు.

ఘనంగా సమత కళాశాల మేనేజ్‌మెంట్ మీట్



జ్యోతి వెలిగించి మీట్ ప్రారంభిస్తున్న ఆచార్య కృష్ణమోహన్ తదితరులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో గురువారం దిశ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఏయూ ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్ ముఖ్యఅతిథిగా జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలపడంలో యువత భాగస్వాములు కావాలన్నారు. మేనేజ్‌మెంట్ విద్యార్థులు దేశ సంపదను, ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల అభివృద్ధికి ఆలోచనలు చేయాలని సూచించారు. విశిష్ట అతిథి ఫ్లూయెంట్ గ్రిడ్ ఉపాధ్యక్షుడు విన్‌స్టన్ ఎస్‌కే ఆడమ్స్ మాట్లాడుతూ తరగతి గదిలోనే విద్యార్థులు పరిశోధనాత్మక విజ్ఞానాన్ని, వ్యాపార ఆలోచనలు పెంచుకోవాలన్నారు. నగరానికి చెందిన 60 వరకు మేనేజ్‌మెంట్ కళాశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మీట్‌లో కామర్స్ ఎక్స్‌పో, హెచ్‌ఆర్ కనెక్ట్, ఈవెంట్స్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఆచార్య విజయరవీంద్ర, మీట్ కన్వీనర్ ఎస్.మాధవీలత, కో-కన్వీనర్ డాక్టర్ డి.హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారు స్టాళ్లకు డ్రా

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులోని స్టాళ్లకు గురువారం ఈవో కొండబాబు ఆధ్వర్యంలో డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రా పద్ధతిలో స్టాళ్లకు డ్రా తీసి రైతులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు.